క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



మహబూబాబాద్: రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించాడు. మున్సిపాలిటీ పరిధిలో సర్వేపల్లి సెంటర్ నుంచి పత్తిపాక రోడ్డు వరకు జరుగుతున్న పనులను చైర్మన్ పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశాడు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే బిల్లులు నిలిపివేయాలన్నారు. అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఈ సీహెచ్ ఉపేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మొక్కు చెల్లింపు



గూడూరు: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన అందించడమే కాక, ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, సీనియర్ నాయకుడు డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో సోమవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి ఎన్నికల ముందు శివుడికి మొక్కిన మొక్కును 108 కొబ్బరికాయలు కొట్టి తీర్చుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ వాసుదేవరెడ్డి, మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నూనావత్ రాధ, యాకయ్య, వెంకన్న, వీరస్వామి పాల్గొన్నారు.

ప్రింటర్ బహూకరణ



కేసముద్రం: మండలంలోని రంగాపురం గ్రామంలోని యూపీఎస్‌కు మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి గార్లపాటి ప్రమోద్, ప్రసన్న దంపతులు తమ కుమార్తె ఈశాద్విత హయాతి పుట్టినరోజు సందర్భంగా రూ.18వేల విలువైన హెచ్‌పీ ప్రింటర్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల శ్రీధర్, కార్యదర్శి అనిల్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వోమ సంతోష్, రాజకుమార్, అశోక్, సరిత పాల్గొన్నారు.

మధుర కవిభూషణ్ పురస్కారం ప్రదానం



సునీతారాణి

పెద్దవంగర: సాహిత్యంలో రంగంలో విశేష కృషి చేసిన తెలుగు ఉపాధ్యాయురాలికి గౌరవం దక్కింది. మేఘన సాహితీ కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన మధురిమలు నూతన లఘు కవితా ప్రక్రియ ఆన్‌లైన్ వేదికగా నిర్వహించారు. ఆన్‌లైన్ పోటీల్లో మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు పోగాకు సరితారాణి లఘు కవితా ప్రక్రియలో 108 మధురిమలు రచించించి ప్రతిభ చూపింది. ఆమె ప్రతిభను గుర్తించిన మేఘన సాహితీ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల సమ్మయ్యతో పాటు సంస్థ ప్రతినిధులు మధుర కవి భూషణ్ పురస్కారం అందించి గౌరవించారు.

నిధులపై స్పష్టత ఇవ్వాలి



మహబూబాబాద్: మాజీ సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి ప్రకటించిన రూ.50కోట్ల నిధులపై స్పష్టత ఇవ్వాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం అజయ్‌సారథి రెడ్డి మున్సిపాలిటీ మేనేజర్ శ్రీధర్‌కు నిధుల విషయంపై వినతిపత్రం అందజేశారు.

బాలికల భద్రతే లక్ష్యం

మహబూబాబాద్ అర్బన్: బాలికల భద్రతే షీ టీం లక్ష్యమని షీ టీం ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ సంగ్రామ్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య నర్సింగ్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు షీ టీంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా సునంద మాట్లాడుతూ.. సైబర్ నేరాల, సైబర్ సెక్యూరిటీ సేవలు 1930 ఉపయోగించుకోవాలన్నారు. పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు చేసుకోవద్దని, ఆన్‌లైన్ ఓటీపీలు, వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయొద్దన్నారు. ఫిర్యాదుల కోసం షీ టీం వాట్సాప్ నంబర్ 87126 56935, 79011 42009 సంప్రందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై ఆనందం, పీసీలు అరుణ, పార్వతి, రమేష్, అధ్యాపకులు పుల్లారావు, తిరుమలేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో కార్తీక మాసం సోమవారాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన భక్తులు పొన్నాల సందీప్, వింధ్యారాణి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో లక్షబిల్వార్చన పూజలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చండీహోమం, పూజలు నిర్వహించారు. మారేడు ఆకులతో లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామిని బిల్వాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో పొన్నాల రాజశేఖర్ దంపతులు, ఆలయ అర్చకులు రెడ్యాల శ్రీనివాస్, పెనుగొండ అనిల్ పాల్గొన్నారు. అనంతరం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డితోపాటు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



మహబూబాబాద్ రూరల్: పూజలు చేస్తున్న భక్తులు



గూడూరు: పూజలో పాల్గొన్న భక్తులు



గార్ల: అన్నాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు



కురవి: అలంకరణలో వీరభద్రస్వామి



కేసముద్రం: శివలింగానికి అభిషేకం

శివుడికి అన్నాభిషేకం

గార్ల: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా గార్లలోని శివాలయంలో శివలింగానికి అర్చకుడు ఎస్.ప్రవీణ్‌కుమార్‌శర్మ అన్నంతో అన్నాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించాడు. తెల్లవారుజాము నుంచి భక్తులు శివుడికి అభిషేకాలు నిర్వహించడంతో శివాలయం భక్తులతో పోటెత్తింది. కార్యక్రమంలో సాయిగౌడ్, వంశీ, వేమిశెట్టి శ్రీనివాస్, కట్టా రమేష్, సునీల్, సుందర్, శివాజీ, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు

మహబూబాబాద్ రూరల్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు సోమవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో ఇమ్మడి రవికుమార్, చౌడవరపు మంజువాణి, చౌడవరపు సుధీర్, సుజాత, ఇమ్మడి చంద్రప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భక్తమార్కండేయ శివుడికి పూజలు

కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలోగల శ్రీ భక్తమార్కండేయ శివాలయంలో రాత్రి శ్రీ భక్తమార్కండేయ శివుడికి ఆలయ ప్రధాన అర్చకులు కొత్తూరి లక్ష్మినర్సింహమూర్తి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు.

గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో కార్తీకమాస చివరి సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు గుడి చుట్టు ప్రదక్షిణ అనంతరం గర్భగుడిలోని శివలింగానికి ఆలయ పూజారి సతీష్‌పాండ్యే పంచామృత అభిషేకాలు, బిల్వార్చన, తులసి పూజలు చేశారు. ఆలయాల్లో భక్తుల సందడి

కేసముద్రం: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో, వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యేకు నాయకుల అభినందనలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిసి సోమవారం శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్, ముల్లంగి ప్రతాపరెడ్డి, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు గుగులోతు హరినాయక్, జిన్నారెడ్డి పద్మజవెంకటేశ్వర్లు, అర్బన్ ఓబీసీ అధ్యక్షుడు లింగాల వీరభద్రం గౌడ్, టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ తిప్పర్తి శ్రీధర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆరేందుల వెంకటేశ్వర చారి, అర్బన్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ముస్లింల అభివృద్ధికి సహకరించాలని తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ.అజీమ్ కోరారు. మురళీనాయక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కేసముద్రం: జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌ను మండల కేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ.రియాజ్‌ఖాన్‌తోపాటు, పలువురు నాయకులు కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సద్దాం ఖాన్, మదార్, ఖాజా, అంజాత్, సల్మాన్, మౌలానా, దినేష్, రాకేష్, రాజేష్, శ్రీనాథ్, భరత్, ఉపేందర్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్టల నరేష్‌తోపాటు చిన్నముప్పారం గ్రామ పార్టీ నాయకులు మురళీనాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలేరు శివాజీ, ఎంపీటీసీ కదిర జగన్, నరేష్, వెంకన్న, యాకాంబ్రం, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యే మురళీనాయక్‌ను కలిసిన నాయకులు



మహబూబాబాద్ అర్బన్: ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న జనసమితి, ఉద్యమకారుల నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన జనసమితి నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ దంపతులను తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు డోలి సత్యనారాయణ, ఉద్యమకారులు పిల్లి సుధాకర్ మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఆరుద్రపరామాత్మచారి, ఖాజా పాషా, సిరిపురం వీరన్న, శ్రీపాల్‌రెడ్డి, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంక బద్రినారాయణ, రాంజీ, మండల శాఖ, రాష్ట్ర, జిల్లా బాధ్యులు కలిసి బొకేను అందజేశారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

మహబూబాబాద్: రైతాంగ నాయకులపై ప్రతికార చర్యలను నిలిపివేయాలని, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. ఎస్‌కేఎం రాష్ట్ర సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి రైతాంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మండల వెంకన్న మాట్లాడుతూ.. మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా, రైతు నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, వెంకటేశ్వర్లు, దేవేందర్, వెంకన్న, సత్యనారాయణ, వీరన్న పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

బోధనలో మెళకువలు పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

దంతాలపల్లి: ఆంగ్ల భాషా పాఠ్యాంశాల బోధనలో మెళకువలు పాటించాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్‌చంద్రశేఖర్ అన్నారు. మండలకేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆంగ్ల భాషా కాంప్లెక్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు ఆంగ్ల భాష పై సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఆంగ్ల భాషాపై ఆధునిక బోధన పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పెర్సన్ ఆంటోని, సౌజా, సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలి

నెల్లికుదురు: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పక్కా సమాచారాన్ని యూడైస్ ప్లస్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని మండల నోడల్ ఆఫీసర్ రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం యూడైస్ ప్లస్ పాఠశాలల హెచ్‌ఎంలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల ప్రొఫైల్, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల సమాచారంతోపాటు విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని పక్కాగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఈనెల 13 వరకు పూర్తి చేసి సంబంధిత ఫార్మెట్లపై కాంప్లెక్స్ హెచ్‌ఎంల సంతకం చేసి ఎమ్మార్సీ కార్యాలయంలో అందించాలన్నారు. దీనిపై హెచ్‌ఎంలకు ఎంఐఎస్ కోఆర్డినేటర్ మస్కపురి సుధాకర్ అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

చిన్నగూడూరు: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాక డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మరిపెడలో జరిగే విజయోత్సవ సభకు హాజరు కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సోమవారం మండలంలోని జయ్యారం గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు భిక్షపతి, మురళి, నవీన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ భాషా దినోత్సవం

పెద్దవంగర: భారతీయ భాషా దినోత్సవ వేడుకలను మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మహాకవి సుబ్రహ్మణ్య భారతి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో భారతీయ భాష దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం.సదయ్య భారతీయ భాషా దినోత్సవం గురించి వివరించారు.

డోర్నకల్ ప్రజలకు రుణపడి ఉంటా..

● ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

దంతాలపల్లి: నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. ఎన్నికల్లో విజయం అనంతరం విజయోత్సవ ర్యాలీలో భాగంగా మొదటిసారిగా మండలంలో పెద్దముప్పారం గ్రామంలో అడుగు పెట్టిన ఎమ్మెల్యే దంపతులకు గ్రామ, మండల నాయకులు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన సతీమణి డాక్టర్ ప్రమీలతో కలిసి గ్రామంలో నిర్వహిస్తున్న పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వివిధ గ్రామాలలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు నాయకులు గజమాలతో సన్మానం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన డోర్నకల్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, నాయకులు రఘువీరారెడ్డి, శ్రీనువాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బట్టు నాయక్, సర్పంచ్ దర్శనాల సుస్మిత పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

మరిపెడకు తరలిన నాయకులు

కురవి: డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి మొదటిసారిగా మరిపెడ కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సోమవారం కురవి మండల కేంద్రం నుంచి భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, మాజీ జెడ్పీటీసీ బాదావత్ రామునాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, నాయకులు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, నారాయణ రాజేందర్‌కుమార్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జనరల్ స్థానంగా మార్చాలి

డోర్నకల్: త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల కోసం అమ్మపాలెం గ్రామాన్ని జనరల్ స్థానంగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని అమ్మపాలెం గ్రామంలో సోమవారం స్థానికులైన తెలంగాణ ఉద్యమకారులు అంకతి నాగేశ్వర్‌రావుతోపాటు ఆవుల నరేష్, సంతోష్, రాము, కొండల్‌రావు, అప్పారావు తదితరులు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో 900 మంది బీసీ ఓటర్లు, 300 మంది ఎస్టీ, 100 మంది ఎస్సీ, 100 ఓసీ ఓటర్లు ఉన్నారని తెలిపారు. 20 ఏళ్లుగా పంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారని వచ్చే ఎన్నికల్లో జనరల్ స్థానంగా మార్చాలని గ్రామస్తులంతా కోరుతున్నారని తెలిపారు.

వైస్ ప్రెసిడెంట్‌గా యోగేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఐకాన్ 2023, గాయత్రి ప్రకాశం వేడుకలు విజయవాడ కంకిపాడులోని అయ్యనా కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 9, 10 తేదీలలో నిర్వహించారు. 2024 సంవత్సరానికి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన వాసవి ఎస్.ఆర్.రవిచంద్రన్ (చెన్నై) 2024 సంవత్సరానికి మహబూబాబాద్ పట్టణానికి చెందిన మాలె యోగేశ్వరరావును ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ (మల్టిపుల్)గా ప్రమాణ స్వీకారం చేయించారు.

సభను జయప్రదం చేయండి

గార్ల: గార్లలో నేడు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య విజయోత్సవ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తొలిసారి ఎమ్మెల్యే గార్లకు విచ్చేస్తున్న సందర్భంగా మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఘనస్వాగతం పలకాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన భాస్కరాచారి అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబానికి, కేసముద్రంవిలేజ్ హైస్కూల్‌కి చెందిన 2001–02 ఎస్సెస్సీ బ్యాచ్ బాల్యమిత్రులు సోమవారం రూ.16వేలు, అరక్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పెదగాని సురేందర్, నాగయ్య, పబ్బతి దామోదర్, మేకల వెంకన్న, శ్యాం, రాజశేఖర్, రవి, మంగి, సూరయ్య, కీర్తి సురేందర్ పాల్గొన్నారు.

గార్ల: గార్లలోని చేపల మార్కెట్ బజారుకు చెందిన కొండ శేఖర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా గార్ల పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ బాధితుడికి రూ.5వేల నగదును అందజేశాడు.

అయ్యప్పమాలధారులకు ముస్లిం భిక్ష



గార్ల: అయ్యప్పమాలధారులకు ముస్లిం ఎండీ షబ్బీర్‌ఖాన్ తన పెళ్లిరోజు సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని శివాలయంలో మధ్యాహ్నం భిక్ష పెట్టించాడు. కార్యక్రమంలో కట్టా రమేష్, ఇమ్రాన్, పాషా, అఫ్జల్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

గంగారం: నర్సంపేట నుంచి గంగారం మండలంలోని మడగూడెం గ్రామానికి ప్రత్యేకంగా బస్సు సౌకర్యాన్ని కల్పించాలని సర్పంచ్ సుంచ వెంకటలక్ష్మీ కోరారు. సోమవారం నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నర్సంపేట మండలంలోని జంగాలపల్లి, పూనుగొండ్ల సర్వీస్ బస్సులను మడగూడెం క్రాస్ వద్దకే కాకుండా గ్రామంలోకి వచ్చి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని పాత రవీంద్ర టాకీసు ప్రాంతంలో ఆదివారం రాత్రి శ్రీఅయ్యప్పస్వామివారి మహాపడిపూజలో ఎమ్మెల్యే మురళీనాయక్, డాక్టర్ భూక్య ఉమా దంపతులు పాల్గొని పూజలు చేశారు.

కోడ్ ముగిసినా తొలగించని ముసుగులు



గార్ల: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసి వారం రోజులు గడుస్తున్నా గార్లలో వివిధ పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకుల విగ్రహాలకు నేటి వరకు ముసుగులు తొలగించకపోవడంతో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే జాతీయ, రాష్ట్ర నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శునకాల బెడదను నివారించాలి

గార్ల: గార్ల పట్టణంలో శునకాల బెడదను నివారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాత్రి సమయంలో వీధుల్లో, రోడ్లపై శునకాలు ఎక్కువగా తిరుగుతుండడంతో భయంతో ప్రజలు బయటికి రాలేకపోతున్నారు. రహదారులపై బైక్‌లు వెళ్తుంటే కుక్కలు బైక్‌ను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని బైకిస్టులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ సిబ్బంది గార్లలో కుక్కలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని గార్ల ప్రజలు కోరుతున్నారు.

పెద్దవంగర ఎంపీటీసీ రాజీనామా

పెద్దవంగర: పెద్దవంగర మండల కేంద్రం ఎంపీటీసీ స్థానానికి ఎంపీటీసీ ఏదునూరి శ్రీనివాస్ రాజీనామా చేశాడు. సోమవారం ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు తన వ్యక్తిగత కారణాలతో ఇటీవల రాజీనామా పత్రాన్ని అందజేయగా సీఈఓ రమాదేవి అమోదించినట్లు ఎంపీడీఓ తెలిపారు. గత ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్దవంగర ఎంపీటీసీగా విజయం సాధించిన విషయం తెలిసిందే.

క్రైం కార్నర్..

ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఒకరు మృతి

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు జగ్గుతండాలో అజ్మీర శ్రీను(40) అనే వ్యక్తి ఆదివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సతీష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మిర్చి పంటకు రోగం వచ్చి సక్రమంగా లేకపోవడం, గతంలో చేసిన అప్పులతో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ.. మానసికంగా కుంగిపోయి క్షణికావేశంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

డోర్నకల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై సంతోష్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమాళ్లసంకీస గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సంగా నర్సింహరావు(38) ఈనెల 6న కాంపల్లి నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా పెరుమాళ్లసంకీస సమీపంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఆల్లపల్లి మండలం పెదవెంకటాపురానికి చెందిన కొండా దేవేందర్ ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి నర్సింహారావు వాహనంను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

కురవిలో ఒకరు..

కురవి: మండల కేంద్రం శివారులోని లింగ్యాతండా జీపీకి చెందిన డప్పు రఘు(33) అనే వ్యక్తి గత కొన్ని రోజుల క్రితం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టాటాఏస్ వాహనాన్ని ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

దంతాలపల్లి: టాటాఏస్ వాహనాన్ని ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టగా ఇద్దరు వ్యక్తులకు గాయాలైన ఘటన సోమవారం తెల్లవారుజాము మండలంలో చోటుచేసుకుంది. ప్రత్యేక సాక్షుల కథనం ప్రకారం తొర్రూరు వైపు నుంచి మరిపెడ వైపు ఓ టాటాఏస్ వాహనం వెళ్తుంతుంది. అదే రూట్లో వెళ్తున్న కారు మండలకేంద్రంలోని ఎస్‌కేఆర్ క్రషర్ మిల్లు సమీపంలో అదుపు తప్పి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో టాటాఏస్ వాహనం డ్రైవర్ లూనవత్ రామారావు, కారు డ్రైవర్ ఉప్పల మహేందర్‌రెడ్డికి గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

ఎంపీటీసీల రహస్య భేటీ



నెల్లికుదురు: ఎంపీపీపై అవిశ్వాసమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా కొంత మంది ఎంపీటీసీ సభ్యులు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులు ఎక్కువ శాతం గెలుపొందినప్పటికీ బీఆర్ఎస్ ఎంపీపీ పదవి కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మళ్లీ ఎంపీపీ పదవిపై అవిశ్వాసం తెరపైకి వచ్చింది. దీనిపై పార్టీలకు అతీతంగా 6గురు ఎంపీటీసీ సభ్యులు రహస్యంగా సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించుకున్నారు. 10నుంచి 12మంది ఎంపీటీసీ సభ్యులతో నేడు(మంగళవారం) సమావేశం ఏర్పాటు చేసుకుని ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. రహస్య సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు జెల్ల వెంకటేష్, కథిర జగన్, పెరుమాండ్ల గుట్టయ్య, నల్లాని శోభ పాపారావుతో పాటు మరో ఇద్దరు పాల్గొన్నారు.